క్లుప్తంగా

అధికారుల అవినీతికి ప్రజలు బలి

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): కొందరు ప్రభుత్వ అధికారుల అవినీతికి ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, దీనిని అరికట్టేందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉందని టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంత రాములు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. చిన్నస్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు ప్రభుత్వ సిబ్బంది అవినీతికి అంతులేకుండా పోయిందన్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

కొత్తగూడెంఅర్బన్(పాల్వంచ): దేశంలోని పరిశ్రమలను, బొగ్గు గనులను ప్రైవేట్ శక్తులకు కట్టబెట్టాలనే నిర్ణయాలను అడ్డుకుంటామని బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు బి.దేవదానం అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి బొగ్గులను, వైజాగ్ స్టీల్, థర్మల్ విద్యుత్ కేంద్రాలను ప్రైవేట్‌కు అమ్మే ప్రయత్నాలను విరమించుకోవాలని, ఇలాంటి నిర్ణయాలను ఖండిస్తున్నామన్నారు. కొత్త పరిశ్రమలు, వ్యవసాయ పద్ధతులు, నైపుణ్యం గల విద్యావిధానం, రవాణా విధానాలను ప్రవేశ పెట్టాలని కోరారు.

కోల్‌బ్లాక్‌ల వేలం తగదు

ఇల్లెందు: సింగరేణిలో కోల్‌బ్లాక్‌లను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం విరమించుకోవాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి అబ్బాస్, మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ తెలిపారు. సోలార్ ప్లాంట్ వద్ద జరిగిన ఫిట్ మిటింగ్‌లో వారు మాట్లాడుతూ.. దేశంలో 60 బ్లాకులను ప్రైవేట్ వారికి కట్టబెట్టే ప్రయత్నం చేయటం తగదన్నారు. ప్రేమ్‌సింగ్, శంకర్, సిరాజ్ అహ్మద్, మహమూద్, లక్ష్మణ్, రాము, పవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కమిటీ ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా కొత్తగూడెం మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్య, ప్రధాన కార్యదర్శిగా నరాటి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం భద్రాద్రి జిల్లా ఏఐటీయూసీ రెండో మహాసభ సారపాకలో జరిగింది. ఈ సభలో యూనియన్ నాయకులు వీరిని ఎన్నుకున్నారు.


జమలయ్య


ప్రసాద్

వితరణ

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామ పంచాయతీకి యల్లంకి అనసూర్యమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఫ్రీజర్ బాక్సును వితరణ చేశారు. ఆదివారం అనసూర్యమ్మ దశదిన కర్మ సందర్భంగా ఫ్రీజర్ బాక్సును ఆమె కుమారుడు పుల్లయ్య, మనవడు నరేష్... వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతులు మీదుగా గ్రామ పంచాయతీకి అప్పగించారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో...

కొత్తగూడెంఅర్బన్: వాసవీ క్లబ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ వారి సూచనల మేరకు ఆదివారం పలువురికి వితరణ కార్యక్రమాలు చేశారు. ఇందులో భాగంగా ఐదుగురు అంధులకు చేతి కర్రలు, స్నేహ ఆశ్రమం పిల్లలకు పుస్తకాలు, పెన్సిళ్లు, వాసవీ అమ్మవారి ఆలయానికి సిమెంట్ బల్ల, పోలీసు వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజేటి రామచంద్రరావు మాట్లాడుతూ... వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గుబ్బా శ్యామ్, గుబ్బా భార్గవి, పల్లపోతు శ్రీనివాస్, రేపాక రాజమనోహర్, సీమకుర్తి రాజమనోహర్ పాల్గొన్నారు.

• గిజిగాడి గూళ్లు



పక్షుల గూడు నిర్మాణంలో గిజిగాడికి సాటిరాదు మరే ఇతర పక్షి. తేలికపాటి గడ్డి పోచలతో గూడును అల్లుకుని రాత్రనక, పగలనక వీచే పిల్లగాలులకు హాయిని గొల్పే ఊయలలూగే గూడు కట్టడంలో గిజిగాడు ప్రదర్శించే కళాత్మకత, నైపుణ్యత, నేర్పరితనం కంప్యూటర్ యుగంలో మానవుడికి కూడా సాధ్యం కానిది. సుజాతనగర్ మండలం సీతంపేట గ్రామ శివారులో తుమ్మచెట్లు, గుబ్బచెట్లకు గిజిగాడు పక్షులు వందల సంఖ్యలో గూళ్లు నిర్మించుకుని శత్రువుల బారి నుంచి గుడ్లను, పిల్లలను కాపాడుకుంటూ ప్రకృతిలో మమేకమై జీవనం సాగిస్తున్నాయి. కొమ్మలకు వేలాడుతున్న గిజిగాడు గూళ్లు వచ్చిపోయే వారిని మైమరపింపజేస్తున్నాయి. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా ఆదివారం క్లిక్ మనిపించింది.

– సుజాతనగర్

24 గంటల వైద్య సేవలేవి?

- నరిపడా వైద్యులు, సిబ్బంది లేక ఇక్కట్లు
- సాయంత్రం ఐదు దాటితే వైద్యం కోసం పరుగులు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు


సుజాతనగర్ ప్రభుత్వాస్పత్రి

సుజాతనగర్: సుజాతనగర్ పీహెచ్‌సీని 24 గంటల పాటు సేవలందించే ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రకటన వెలువడగానే మండలవాసులు సంతోషపడ్డారు. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా వైద్యం అందుతుందని, జిల్లా కేంద్రానికి పరుగులు తీయాల్సిన పనిలేదని ఆనందించారు. కానీ వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో గతంలో మాదిరిగానే సాయంత్రం ఆస్పత్రి మూతపడుతోంది. దీంతో తమ ఆనందం మూన్నాళ్ల ముచ్చటేనా అని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఎనిమిది గంటలేనా..?

మండల కేంద్రంలోని ఆస్పత్రిలో గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందేవి. ఆస్పత్రి చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలో విస్తరించి ఉండగా.. ఆయా మండలాల్లోని 60 గ్రామాల ప్రజలకు వైద్యం అందించాల్సి ఉంటుంది. దీంతో పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్యం అందించనున్నట్లు గత ఏడాది ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఎనిమిది గంటలే వైద్యం అందుతోంది.

సౌకర్యాలు కరువు..

సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటల ఆస్పత్రిగా ప్రకటించిన అధికారులు అందుకు తగినట్లుగా సిబ్బందిని నియమించలేదు. ఒక స్టాఫ్ నర్స్, నైట్ వాచ్‌మెన్, కాంటినెంట్ వర్కర్ నియామకాలు జరగాల్సి ఉంది. ఇక 108 వాహనాన్ని భద్రపరిచేందుకు షెడ్ నిర్మించ లేదు. దీంతో ఆరోగ్య సేవల్లో మేటిగా నిలిచి కాయకల్ప, ఎన్క్వాస్ అవార్డులు దక్కించుకున్న ఈ ఆస్పత్రికి వచ్చే వారికే కాక విధులు నిర్వర్తించే ఉద్యోగులకూ తిప్పలు తప్పడం లేదు.

వైద్యులు, సిబ్బంది నియామకం ఏది?

ఆస్పత్రిలో ఇద్దరు రెగ్యులర్ వైద్యులకు గాను ఒక్కరే ఉన్నారు. మరో వైద్యుని పోస్టు ఎన్నో రోజులుగా ఖాళీగానే ఉంటోంది. ఆస్పత్రి పరిధిలో సుజాతనగర్, వేపలగడ్డ, సీతంపేట, పాత అంజనాపురం, సర్వారం, సింగభూపాలెం, విద్యానగర్-1, విద్యానగర్-2, బాబూక్యాంప్, రాంనగర్, చుంచుపల్లి, ఏబీ నగర్.. ఇలా 12 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఆరోగ్య ఉపకేంద్రాల్లో సైతం మొదటి, రెండో ఏఎన్‌ఎంల కొరత చాలాకాలంగా వేధిస్తోంది. చాలా చోట్ల ఏఎన్‌ఎంలు సరిపడా లేక వైద్యం అందటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పీహెచ్‌సీ పరిధిలో 50 వేల వరకు జనాభా ఉండగా.. ఆరు పడకలే ఉండటంతో వైద్యం అందించడం ఉద్యోగులకూ కష్టమవుతోంది. అయితే జూలూరుపాడులో 32 పడకలు ఉండగా.. సమీపానే జిల్లా కేంద్రం కొత్తగూడెం కూడా ఉండడంతో సుజాతనగర్ ఆస్పత్రిలో పడకలు పెంచడం లేదనేది అసలు కారణం. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిని నరిపడా నియమించి 24 గంటల పాటు వైద్యం అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి...



24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినా అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించలేదు. ఎక్కువగా గిరిజనులున్న ప్రాంతమిది. జ్వరాలు, ప్రమాదాల బారిన పడిన వారు చికిత్స కోసం వస్తుంటారు. ఇకనైనా వైద్యులను నియమించి పడకలు పెంచాలి.

– వీర్ల రమేష్, సీపీఎం మండల కార్యదర్శి

వైద్యులు అందుబాటులో ఉండాలి...



గ్రామాల్లోని సబ్ సెంటర్లలో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తే ఇబ్బంది ఉండదు. ఈ విషయాన్ని గుర్తించి వైద్యులు అందుబాటులో ఉండేలా చూస్తూ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బందిని నియమించాలి.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర

ప్రభుత్వానికి నివేదిక పంపాం...



24 గంటల ఆస్పత్రికి కావాల్సిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. సిబ్బంది నియామకం జరగగానే 24 గంటలపాటు వైద్యసేవలు అందుతాయి. ఏఎన్‌ఎంల ఖాళీల విషయమై ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ఆదేశాలు రాగానే భర్తీ చేస్తాం.

– డాక్టర్ రమేష్, వైద్యాధికారి

లోతట్టు ప్రాంతాల్లో చర్యలు తీసుకోండి


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో విద్యానగర్ కాలనీ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటితో పాటు లోతట్టు ప్రాంతాలను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పరిశీలించారు. మాట్లాడుతూ... వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ ఈఓను పిలిపించి నిలిచిన వర్షపు నీటిని మళ్లింపు చేయాలని సూచించారు. అదేవిధంగా పట్టణ పరిసర ప్రాంతాలు ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏ చిన్న సమస్య ఏర్పడినా చొరవ తీసుకొని ఆ సమస్యను పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు వాసిరెడ్డి మురళీ, మూర్తి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా

పాల్వంచరూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి బిక్కుతండా గ్రామంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాజీ సర్పంచ్ భూక్యా అమర్‌సింగ్, మాజీ ఉపసర్పంచ్ నాను ఆధ్వర్యంలో 30 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ప్రాథమిక సభ్యత్వాలను అందజేశారు. అనంతరం మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ సేవలు అందించే వారికే ప్రజలు అండగా ఉంటారన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని పార్టీ శ్రేణులు బాధ్యతగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ప్రజాసమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని సత్వరమే పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, ఎస్‌కే సాబీర్‌పాషా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్, గిరి, వేములపల్లి శేఖర్, భూక్యా విజయ్, జకరయ్య, పాషా, బానోతు రంజిత్, ప్రేమ్, సక్కు, దావు, లక్కు, వీరన్న, రాములు, వెంకటేష్, రాజు, మంగపతి, బాబు, శ్రీను, భద్రు తదితరులు పాల్గొన్నారు.

వేతన హామీని అమలు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెండింగ్ మెస్ బిల్లులు, పెంచిన వేతనం, హామీ ఇచ్చిన వేతనాలు అమలు చేసే విధంగా కృషి చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా వంట కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, వంట సరుకులను గ్యాస్, గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, వయస్సు పైబడిన వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వండి


అభివాదం చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఇల్లెందు: ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకులు మారటం లేదని, ఏ ప్రభుత్వం వచ్చినా గిరిజనుల భూములు లాక్కుంటున్నారని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయాలని తుడుందెబ్బ రాష్ట్రర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం తుడుందెబ్బ మండల జనరల్ కౌన్సిల్ సమావేశం పట్టణంలోని గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్ భవన్‌లో జరిగింది. రామస్వామి మాట్లాడుతూ... గుండాల మండలం కాచనపల్లిలో ఇటీవల పోడు భూముల్లో ట్రెంచ్ తవ్వకాలు చేశారని గుర్తుచేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా అటవీశాఖకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలిగించాలని, పెసా కమిటీలను బలోపేతం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గుమ్మడి రామ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా చీమల రమేష్, ప్రధాన కార్యదర్శిగా గొగ్గెల రమేష్, సహాయ కార్యదర్శిగా తాటి కృష్ణ, కోశాధికారిగా చింత నర్సయ్య, గౌరవ సలహాదారుగా కుంజ కృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా కల్తీ మల్లయ్యలను ఎన్నుకున్నారు.

శ్రీనివాస్ సేవలు అనిర్వచనీయం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందురూరల్: ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈఓగా, ఉపాధ్యాయ సంఘం నేతగా, జన్మనిచ్చిన గ్రామాభివృద్ధిని కాంక్షిస్తూ చేపట్టిన పనులతో బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన బాధ్యతలను పిల్లి శ్రీనివాస్ సమర్థవంతంగా నిర్వహించారని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం డీఈఓ వెంకటేశ్వరచారి, ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. చల్లసముద్రం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు వాహనాలకు టెండర్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు వర్క్‌షాప్‌లో 2 డబ్ల్యూడీ నాన్ ఏసీ క్యాంపర్ ఒకటి అద్దె వాహనం కోసం ఈనెల 25న లక్కీ డ్రా నిర్వహిస్తామని ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జూన్‌లో దరఖాస్తు చేసుకున్న వాహనదారుల సమక్షంలో టెండర్ లక్కీ డ్రా 25న మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.

గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలని, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని, డిసెంబర్‌లో గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలని బీఎస్పీ నాయకుడు యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్రూప్-2, 3 పోస్టులు పెంచుతామని, జీఓ 46 బాధితులకు న్యాయం చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. టెట్ స్కోర్లను నార్మలైజ్ చేశాకే డీఎస్సీ నిర్వహించాలని, ఏఈఈల నియామకం జరిపించాలని, గురుకుల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

పోచారం తండాలో భూవివాదం

ఇల్లెందురూరల్: పోచారం తండాలో రెండు కుటుంబాల మధ్య ఆదివారం భూసరిహద్దు వివాదం జరిగింది. బాధితుడు బానోత్ శ్రీను తెలిపిన వివరాలు... ఏడు సంవత్సరాల క్రితం భూక్యా రమేష్, రాంజీల వద్ద ఎకరం పోడు కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఇటీవల తన పొలం వెంట పోడు నరికి సాగుకు అనువుగా మార్చుకున్న రమేష్, రాంజీ ఇరువురు తనకు విక్రయించిన చేనులో కొంత ఆక్రమించి సరిహద్దు పెట్టారని వాపోయాడు. ఈ విషయంపై గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినా ఫలితం లేకపోయిందన్నారు. గ్రామపెద్దల సూచన మేరకు తన భూమిలో పత్తి విత్తనాలు విత్తుకున్నట్లు చెప్పాడు. కానీ విక్రయించిన వ్యక్తులు తన చేనులో కొంత భాగం ఆక్రమించి సరిహద్దు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దీన్ని ప్రశ్నించినందుకు గాను తనతోపాటు తన కుమారులు అనిల్, సునిల్, భార్య భారతిలపై దాడి చేశారని వాపోయాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనును స్థానికులు కొమరారం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇల్లెందుకు అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీను తెలిపాడు.

నీట్ లీకేజీకి కేంద్రమే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న భూపేష్

కొత్తగూడెంఅర్బన్(సింగరేణి): నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించి దోషులను శిక్షించాలని, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్ డిమాండ్ చేశారు. ఆదివారం రామవరంలోని సీపీఐ వీఎంఏ కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. మే 5న దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్షకు దాదాపు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని, జూన్ 4న ఈ పరీక్ష ఫలితాలు వచ్చినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 67 మందికి 720/720 మార్కులు వచ్చాయని, టాప్ స్కోర్ వచ్చిన 67 మందిలో ఆరుగురు హర్యానాలోని ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాయటంతో పలు అనుమానాలు తలెత్తాయన్నారు.

పక్కా ప్లాన్‌తో పేపర్ లీక్, ఇందుకోసం బీహార్‌కు చెందిన ముఠా 35 మంది విద్యార్థుల నుంచి రూ.30 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తేలిందని, అన్ని విధాలుగా విచారణ చేయాలని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఎస్‌కే ఖయ్యూం, ఎస్‌కే రసూల్ పాషా, మజ్జిగ రణధీర్, వెంకట్, శ్రీనివాస్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాతుకు తరలిరండి..


మాట్లాడుతున్న వెంకన్న

జూలూరుపాడు: జూలై 7న వరంగల్‌లో జరగనున్న మాదిగల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్-ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దిబ్బెందుల సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వెంకన్న మాట్లాడుతూ... జూలై 1994లో మొదలైన మాదిగల ఉద్యమం జూలై 7 2024 నాటికి 30 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెల్ల షర్టు, బ్లాక్ పాయింట్ డ్రస్ కోడ్‌తో జరిగే కవాతుకు మాదిగలు లక్షలాది మంది తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సుజాతనగర్, జూలూరుపాడు మండలాల ఇన్‌చార్జ్ చెంగల గురునాథం, మండల అధ్యక్షుడు సాయికుమార్, కాకటి వెంకటి, మోదుగు శివ, దంసలపూడి సంతోష్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతీ ముద్దు


ఆందోళన చేస్తున్న మహిళలు

ఇల్లెందు: పట్టణంలోని 1వ, 2వ వార్డు సత్యనారాయణపురం వాసులు మున్సిపాలిటీ వద్దు.. గ్రామపంచాయతీ ముద్దు అంటూ ఆందోళన నిర్వహించారు. ఆదివారం రెండు వార్డులకు చెందిన మహిళలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. గడిచిన ఎన్నికలకు ముందు సత్యనారాయణపురం గ్రామం వరకు సుదిమళ్ల గ్రామపంచాయతీలో అంతర్భాగంగా ఉంది. మున్సిపాలిటీ విస్తరణలో భాగంగా సత్యనారాయణపురం, 24 ఏరియాను మున్సిపాలిటీలో విలీనం చేశారు. విలీనమైన సత్యనారాయణపురం, 24 ఏరియాలు రెండు వార్డులు అయ్యాయి. ఎన్నికలు జరిగి వార్డు సభ్యుల కాలం కూడా సమీపిస్తోంది. ఈ తరుణంలో గ్రామంలోని మహిళలు తమను పంచాయతీలోనే కొనసాగించాలని నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీలో ఉంటే నల్లా పన్ను రూ.30 ఉండగా.. మున్సిపాలిటీలో కలిసిన తర్వాత రూ.150 పెరిగిందని, ఇటీవల అధికారులు ఇంటి, నల్లా పన్ను చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నట్లు వాపోయారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలోకి మారిన తర్వాత రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు, అనేక అభివృద్ధి పనులు జరిగాయి. మున్సిపాలిటీలోకి మారిన తర్వాత ఇంటి విలువ, రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కలిగిందని, మళ్లీ పంచాయతీలోకి వెళితే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని మరికొంత మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శివనగర్‌లో సమస్యల తిష్ట

- వర్షాలతో అధ్వానంగా మారిన కాలనీ రోడ్డు
- డ్రెయినేజీలు లేక అవస్థలు.. కానరాని వీధిలైట్లు
- పలుచోట్ల అక్రమ మట్టి డంపింగ్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


వర్షానికి అధ్వానంగా మారిన శివనగర్ రోడ్డు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని శివనగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. శివనగర్, దమ్మపేట రోడ్డు నుంచి మారుతీ షోరూం పక్క ఏరియా ఇటీవల కాలంలో గణనీయంగా అభివృద్ధి చెందింది. కేటీపీఎస్ ఉద్యోగులు అధికంగా ఇక్కడే నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. మట్టి రోడ్డు కావడంతో నిత్యం గుంతలు పడి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇక వర్షాకాలంలో రోడ్డు మొత్తం చిత్తడిగా మారి రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని మున్సిపల్ అధికారులను కోరుతున్నా పట్టించుకున్న నాథుడే లేడు.

ఇక్కడ అన్నీ సమస్యలే...

వర్షాకాలంలో రోడ్డు మొత్తం అధ్వానంగా మారడంతో అటుగా తిరిగే స్థానికులు బురదలో నుండే వెళ్లాల్సి వస్తోంది. ఇక మున్సిపాలిటీ డ్రెయినేజీలు, వీధిలైట్లు మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి. ఇళ్లల్లో నుంచి వచ్చే నీరు, వర్షాకాలంలో వరద బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వర్షపు నీరు ఖాళీ ప్లాట్లు, ప్రదేశాల్లో నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకుప్పలు ఎక్కడిక్కడే పేరుకు పోతున్నాయి. మున్సిపాలిటీ సిబ్బంది సైతం చెత్త సేకరణ మరిచింది. వీధిలైట్లు లేక సాయంత్రం అయితే అంధకారం అలముకుంటోంది.

అక్రమ మట్టి డంపింగ్‌లు...

ఇటీవల అక్రమార్కులు ఈ కాలనీలోని ఖాళీ ప్లాట్లలో మట్టి డంపింగ్‌లకు ఆలవాటుగా మార్చుకున్నారు. చింతలచెర్వు నుంచి మట్టిని పొలాలకు తరలింపు పేరుతో తెచ్చి ఇక్కడి నివాస సముదాయాల మధ్య పెట్టి జేసీబీలతో తిరిగి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ లారీలు తిరుగుతుండటంతో రోడ్డు మరింత ఛిద్రంగా మారాయి. అయినా అక్రమ డంపింగ్‌లపై అధికారులకు చలనం లేదని పలువురు వాపోతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తీరని సమస్యలు...

శివనగర్ ఏరియాలో పెట్రోల్ బంక్ వెనుక భాగంలో స్థానికులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య తీరడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


ఖాళీ ప్రదేశంలో నిల్వ ఉన్న నీరు

శివనగర్‌పై దృష్టి సారించాలి..



శివనగర్ ఏరియాలో సమస్యలు తిష్టవేశాయి. మట్టి రోడ్డు మొత్తం దెబ్బతింది. సీసీ రోడ్డు వేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వర్షాకాలంలో రోడ్డు మొత్తం అధ్వానంగా తయారైంది. రాకపోకలకు తీవ్ర అవస్థ పడుతున్నాం.

– వి.సీతారాములు, స్థానికుడు

అధికారులు స్పందించాలి...



మారుతీ షోరూం వెనుక ఏరియాలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. రోడ్లు, డ్రెయినేజీ, వీధి లైట్లు, తాగునీటి పంపులు లేవు. దమ్మపేట రోడ్డులో పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ఏరియా సమస్యలను పరిష్కరించాలి. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

– గంధం ప్రసాద్, స్థానికుడు

సమస్యలు పరిష్కరిస్తాం...



శివనగర్ ఏరియా సమస్యలు పరిష్కరిస్తాం. ఇటీవల మెయిన్ రోడ్డులో డ్రెయినేజీలు నిర్మించడం జరిగింది. అదేవిధంగా మరికొన్ని డ్రెయినేజీలకు ప్రతిపాదనలు చేసి ఉంచాం. రోడ్లు కూడా వేసేలా చూస్తాం. ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తాం.

– ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్